# Eenadu

## ఏఈఈ ఉద్యోగాలకు 71 వేల దరఖాస్తులు

### ప్రిలిమ్స్ నిర్వహణపై పరిశీలన

**ఈనాడు, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 748 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఏఈఈ) ఉద్యోగాల భర్తీకి నిర్వహించనున్న పోటీ పరీక్షకు 71,090 మంది దరఖాస్తు చేశారు. సాధారణంగా ఈ తరహా ఉద్యోగాలకు 25వేల వరకు మాత్రమే దరఖాస్తులు వస్తాయి. వ్యవసాయ ఇంజినీరింగ్ ఉద్యోగాలు తక్కువగా ఉన్నందున వందలోపే దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. మెకానికల్ కంటే సివిల్ ఇంజినీరింగ్ ఉద్యోగాలే ఎక్కువగా ఉన్నాయి. 25వేల కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లయితే ప్రిలిమ్స్ నిర్వహించేందుకు ఏపీపీఎస్సీ ప్రభుత్వం నుంచి ఆమోదం పొందింది. దీనిని ఈ ప్రకటనకు వర్తింపచేస్తుందా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రిలిమ్స్ పెట్టే పక్షంలో రాత పరీక్ష జరపాలా? ఆన్‌లైన్‌లో పరీక్ష జరపాలా అన్న దానిపై సమాలోచనలు సాగుతున్నాయి. నవంబరు 3 నుంచి 5 వరకు రాత పరీక్షలు జరిపే అవకాశం ఉందని ఏపీపీఎస్సీ సూచప్రాయంగా ఇప్పటికే వెల్లడించింది. దరఖాస్తుల సంఖ్య విపరీతంగా పెరిగినందున నవంబరు తొలివారంలో పరీక్షలు జరపగలమా? లేమా? అన్న దానిపైనా తర్జనభర్జనలు జరుగుతున్నాయి. త్వరలో జరిగే పబ్లిక్ సర్వీస్ కమిషన్ సమావేశంలో తగిన నిర్ణయాలు తీసుకుంటామని ఏపీపీఎస్సీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు.